# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శుక్రవారం 07 నవంబర్ 2025


## వేర్వేరు దొంగతనాల కేసులో ఇద్దరు దొంగలు అరెస్ట్



ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 6, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పరిధిలోని 1వ పట్టణ పీఎస్ అలాగే 3వ పట్టణ పీఎస్ పరిధిలో జరిగిన వేర్వేరు దొంగతనాల కేసులో ఇద్దరిని అరెస్టు చేసి మీడియా ముందు హాజరుపరిచారు. గురువారం సాయంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పి.భావన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గతంలో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో షేక్ దారుభయ్యగారి మహబూబ్ షరీఫ్ అలాగే పొలంకి మహేష్‌లకు చెందిన బంగారు దుకాణాల్లో దొంగతనం జరగ్గా ఒకో పట్టణ పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేశామని ఈ కేసులకు సంబంధించి కడప చిన్నచౌకు చెందిన 37 సంవత్సరాల రాగా హరీష్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు అతని వద్ద నుంచి రూ.20లక్షలు విలువ చేసే 181 గ్రాములు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే గతంలో జరిగిన ఒక దొంగతనం కేసుకు సంబంధించి 3వ పట్టణ పోలీసు స్టేషన్‌లో బాధితుని ఫిర్యాదుతో ప్రొద్దుటూరు ఇస్లాంపేటకు చెందిన షేక్ మౌలాలిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 30 గ్రాములు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి కేసును త్వరితగతిన చేదించిన సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బందికి ఆమె అభినందనలు తెలిపారు.

## శ్రీచరణికి 10 లక్షలు నజరానా




రాజంపేట, నవంబర్6 ప్రభాతవార్త

రాజ్యసభ సభ్యులు, వైసిపి సీనియర్ నేత మేడా రఘునాథ్ రెడ్డి ఇటీవల వన్డే ప్రపంచ కప్ గెలిచిన మహిళా జట్టులోని సభ్యురాలు అయిన క్రికెటర్ శ్రీచరణికి పది లక్షల రూపాయల ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. కడప జిల్లా వీరపునాయుని పల్లె మండలం ఎర్రమల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి జిల్లాకు చెందిన బాలిక కావడం గర్వకారణం అన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయినా ఎంపీ స్పందించి త్వరలోనేశ్రీచరణి కి పది లక్షల రూపాయలు అందించనున్నట్లు వెల్లడించారు.

# 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్

### ఒకటి కాదు.. రెండు కాదు..34 అక్రమ రిజిస్ట్రేషన్లు ... అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దుకు రెవిన్యూ మీనమేషాలు

రాజంపేట, నవంబర్6 ప్రభాతవార్త

నూతన గ్రీన్ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి 500 మీటర్ల దూరంలో ఈ ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రభుత్వ భూమిని ఇష్టా రాజ్యంగా అమ్ముకున్నారు. ప్రభుత్వ భూమిని మరొక నెంబర్ వేసి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ అధికారులు కూడా ఏమాత్రం జంకు బంకు లేకుండా ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు .అయితే పట్టించుకునే దిక్కులేదు. ఒకరిపై కూడా చర్యలు లేవు .10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా చేసినా నేటికీ అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయలేదంటే అధికారులను ఏమనాలి. వార్త ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన తర్వాత స్పందించారే కానీ రిజిస్ట్రేషన్ రద్దు చేయలేదు. దీంతో మరలా అక్రమార్కులు తాజాగా ఆక్రమణలకు తెరదించారు.గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ భూములు అమ్ముతున్నారు. రాజంపేట మండలం కూచివరపల్లె గ్రామ పొలంలో సర్వేనెంబర్ 1584లో సర్వే పది కోట్లు విలువ చేసి నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని గత ఎనిమిది సంవత్సరాలుగా అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని ఆధారాలతో సహా వార్త దినపత్రిక ఈ ఎడాది ఫిబ్రవరి 19 నుంచి మూడు రోజులపాటు ధారవాహికంగా అక్రమాలపై వార్తా కథనాలు ప్రచురించడంతో అప్పటి జిల్లా కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. రాజంపేటసబ్ కలెక్టర్ నైదియ దేవి, రాజంపేట తాసిల్దార్ పీర్ మున్ని స్పందించి కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వ పులి సరిహద్దుల్లో నిర్ధారించలేదు. అయితే కాకుండా 2017 నుంచి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయలేదు. రాజాగా అక్రమార్కులు మరల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమ్ముకుంటున్నట్లు సమాచారం అందింది. రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2020లో



ప్రధాన రహదారికి పక్కనే ఆక్రమించేందుకు మట్టితోలిన దృశ్యం



అధికారులు తొలగించిన శిథిలాల సాక్షి గా ఆక్రమణలు

2072,2073, 2074 20 75, 2076, 2077, 2539, 2540, 3535,3536,3537, 3538, 3539, 3540, 3541, 3617, అలాగే 2022లో డాక్యుమెంట్ నెంబర్ 195 198,652, 2649, 3834, అలాగే 2023లో 1411,1412 ,1413 డాక్యుమెంట్లు ప్రభుత్వ భూమిని రిజిస్ట్ చేశారు. ప్రభుత్వ భూమికి పక్కనే ఉన్న మిట్టమీద పల్లె గ్రామ పొలం కొమ్మి వారి పల్లె అరుంధతి వాడకి సమీపంలోని 1077/3 సర్వే నెంబర్ వేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. పలువురు మిట్టమీద పల్లె పంచాయతీ కార్యదర్శులు, కొందరు తాసిల్దార్లు అనుభవ సర్టిఫికెట్లు కూడా ఇచ్చారు. వారి సంతకాలు కొన్ని ఫోర్జరీ కూడా చేశారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అప్పటి వైసిపి నేతల ఒత్తిడితో పెద్ద ఎత్తున ముడుపులు ముట్టజెప్పడంతో అక్రమ అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇకనైనా కొత్త కలెక్టర్ అక్రమ రిజిస్ట్రేషన్ లపై చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం. ప్రధానంగా అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయకపోతే మరలా అమాయకులు మోసపోయి అక్రమార్కులు వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపోతారని అధికారులు తెలుసుకోవాల్సి ఉంది.

### మదనపల్లెను జిల్లాగా ప్రభుత్వం

# గ్రీన్‌సిగ్నల్...

మంత్రి వర్గ ఉపసంఘ సమావేశంలో వెల్లడి

జిల్లా కోరిక నెరవేరిన ప్రజల ఆకాంక్ష



మదనపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త :

ఎంతో చరిత్ర కలిగిన మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం జరిగింది. దీంతో మదనపల్లె రెవెన్యూ డివిజన్ ప్రజల జిల్లా కోరిక ఎట్టకేలకు నెరవేరినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన సచివాలయంలో జిల్లాల ప్రకటనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసిఎల్ ఇన్‌చార్జ్ సాయిప్రసాద్ జిల్లాల ప్రకటనపై మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో ప్రెజింటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో మదనపల్లెతో పాటు మార్కాపురాన్ని కూడా జిల్లాగా ప్రకటించేందుకు సమావేశంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. మదనపల్లె జిల్లాతో పాటు పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించేందుకు కూడా మంత్రివర్గ ఉపసంఘం వెల్లడించింది. మదనపల్లె జిల్లాలో పీలేరు, తంబళ్ళపల్లె, పుంగనూరు, మదనపల్లె నాలుగు నియోజకవర్గాలు కలిపేలా చర్యలు తీసుకొన్నారు. ఈ మేరకు ప్రతిపాదనల కూడా సిద్ధం చేశారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా పరిధిలో ఉన్న పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు రాయచోటి డివిజన్‌లోని పీలేరు, గుర్రంకొండ, కలకడ, కెవి.పల్లిలను కూడా మదనపల్లె జిల్లాలో కలిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 11మండలాలు ఉండగా జిల్లా ప్రకటన దృష్ట్యా మిగిలిన మండలాలు విలీనం చేయడం పట్ల మదనపల్లె జిల్లా పరిధిలో 21 మండలాలు ఏర్పడనున్నాయి. మదనపల్లెకు బ్రిటీష్ పరిపాలన కాలం నుంచి ఎంతో పేరు ప్రఖ్యాత ఉంది. అప్పటిలోనే మదనపల్లెను ఆసియాఖండంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. గతంలో 31మండలాలు మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవి. మదనపల్లెకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. వందేళ్ళ క్రితం రాయలసీమలోనే తొలి డిగ్రీ కళాశాలగా బిటి కళాశాలను డాక్టర్ అనిబిసెంట్ నిర్మించడం జరిగింది. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లె బిటి కళాశాలలోనే జనగణమనను బెంగాలి బాష నుంచి ఆంగ్లలోకి అనువదించడం జరిగింది. ఇక ప్రపంచ తత్తవేత్త జిడ్డుక్రిష్ణమూర్తి ఇక్కడే జన్మించారు. క్షయవ్యాధి నివారణ కోసం వందేళ్ళ క్రితం ఏర్పాటు చేసిన ఆరోగ్యవరం ఆసుపత్రి కూడా మదనపల్లెలో ఉండడం ప్రపంచంలోనే గుర్తింపు వచ్చింది. బ్రిటీష్ పరిపాలనా కాలంలోనే మదనపల్లెలో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విశాలమైన స్థలాల్లో ప్రభుత్వ భవనాలను నిర్మించారు. అన్ని హంగులు ఉన్నా మదనపల్లెను ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం జిల్లాగా చేస్తుండడం పట్ల మదనపల్లె ప్రజలు హర్షిస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొంటున్నారంటూ పలువురు చెబుతున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి నిర్వహించే క్యాబినేట్ సమావేశంలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది.

# దయనీయస్థితిలో స్మశాన వాటిక

- స్మశానం సైతం ఆక్రమణకు గురవుతున్న దుస్థితి
- వేల కుటుంబాలకు ఒక్కటే స్మశాన వాటిక
- పట్టించుకోని అధికారులు
- మండిపడుతున్న ప్రజలు



బద్వేలు ,నవంబర్ 6, ప్రభాతవార్త:

బద్వేలు మున్సిపాలిటీలోని హిందూ స్మశాన వాటికలు దయనీయ స్థితిలో ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వంలో రూ.130 కోట్ల నిధులు మున్సిపాలిటీకి వదిలిన క్రమంలో స్మశాన వాటికలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. అయితే మన నాయకుల అనాలోచనతో నిధులు సద్వినియోగం చేసుకోవడంలో విఫలం కావడంతో కేవలం 40 కోట్లు మాత్రమే ఉపయోగించి మిగతా డబ్బులు ఖర్చు చేసేందుకు అధికారులు ఆంక్షలు పెట్టడంతో నిధులు ఆగిపోయాయి. పట్టణంలో ఉన్న హిందూ స్మశాన వాటికల దుస్తితిపై రాజకీయ నాయకులు పట్టించుకోకపోవడంతో దయనీయంగా మారాయని ఒక్కరూపాయి నిదులు కూడా స్మశాన వాటికకు ఖర్చు చేయలేదని నాయకుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటిలో ఒకటైన సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు కార్యాలయం వెనుక ఉన్న స్మశాన వాటిక. ఈ స్మశాన వాటికను కొన్ని వేల కుటుంబాలకు ఉపయోగపడుతుంది. ఇక్కడ ఉన్న అతిపెద్ద స్మశాన వాటికకు సరైన హద్దులు లేకపోవడంతో కబ్జాకు గురైంది. ఉన్న స్మశాన వాటిక నానాటికి కుదించుకుపోయి కబ్జాకు గురికావడంతో అధికారులు పట్టించుకోకపోవడం వలన నేడు పూర్తిగా స్మశాన వాటికకు హద్దు లేలేకుండా పోయాయి. కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలేకాకుండా స్మశానాలను ఆక్రమించే దుస్థితికి వచ్చారంటే వారి పరిస్థితి ఏవిదంగా ఉందో అర్థమవుతుంది. స్మశాన వాటికను అభివృద్ది చేసి వేల కుటుంబాలకు ఉపయోగపడేలా చూడాలని ప్రజలు కోరుతుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. స్మశాన వాటికలో ఒక్క బోరు కూడా లేని దుస్థితి ఏర్పడడంతో మనిషిచనిపోయాక ఖననానికి వచ్చినపుడు స్నానం చేసేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వేలరూపాయలు ఖర్చుపెట్టి ఖననం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మశాన వాటిక అంతా కంపచెట్లతో నిండిపోవడంతో చనిపోయినపుడు ఖననం చేయాలంటే కష్టంగా మారింది. వేలాది రూపాయలు ఖర్చుపెట్టి జేసీబీలు తెచ్చి ఖననం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కబ్జాకు గురైన స్మశాన వాటిక హద్దులు ఏర్పాటు చేసి కాంపౌండ్‌ను నిర్మించి స్మశాన వాటికలో అవసరమైన వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇలాంటి స్మశాన వాటిక ఎక్కడా ఉండదు:



ఇలాంటి హిందూ స్మశాన వాటిక ఎక్కడా ఉండదని, కంపచెట్లతో నిండిపోయి కబ్జాతో నిండిన స్మశానం చుట్టుపక్కలా ఎక్కడా కనపడదు. వేలకు వేలు పన్నులు కడుతుంటే చనిపోయిన వ్యక్తి సంతోషంగా ఖననం చేసే పరిస్థితి లేదని , చుట్టూ కంపచెట్లు దయనీయ పరిస్థితిలో ఉన్న ఈ స్మశాన వాటికను అభివృద్ది చేయాలని ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. రాజకీయ నాయకులు చూసి చూడనట్లు వ్యవహరించడం వలన హిందూ స్మశాన వాటిక దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటికను అభివృద్ది చేయాలి

- ఆవుల కొండయ్య, శ్రీకృష్ణదేవరాయనగర్, బద్వేలు.

## రాజంపేటతో పాటు 7 రైల్వే స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు

### 11.76 కోట్లతో టెండర్లు పిలిచిన రైల్వే

రాజంపేట, నవంబర్6 ప్రభాతవార్త

అమృత్ పథకం కింద పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్లో లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు.ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజర్ గురువారం లిఫ్టులకు సంబంధించి టెండర్లు పిలిచారు. రాజంపేట తో పాటు తాడిపత్రి, డోన్, గుత్తి పాకాల రైల్వే స్టేషన్లలో కూడా లిఫ్టులు ఏర్పాటు చేస్తారు. అలాగే మంత్రాలయం, డోన్ ,తాడిపత్రి రైల్వే స్టేషన్లలో 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు ఎస్కెలెటర్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఈ పనులన్నిటికీ 11.76 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు.

# జిల్లాలో అన్ని గ్రామాలకు సురక్షితమైన తాగునీరు అందాలి

### డ్రింకింగ్ వాటర్ శానిటేషన్ మిషన్ కమిటీ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, నవంబర్ 6 : ప్రభాతవార్త

జిల్లాలో ఏ గ్రామంలో కూడా తాగునీటి కొరత రాకుండా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జల్ జీవన్ మిషన్ ద్వారా.. జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా, పరిశుధ్య పనుల పురోగతిపై.. డ్రింకింగ్ వాటర్ శానిటేషన్ మిషన్ కమిటీ సభ్యులైన.. అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కుళాయి కనెక్షన్లను పూర్తి స్థాయిలో నిర్వహణలోకి వచ్చేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి పథకాల అమలు పనితీరును మెరుగు పరిచేందుకు క్రమం తప్పకుండా త్రాగునీటి నాణ్యతా పరీక్షలను నిర్వహించాలని క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పులివెందుల వాటర్ గ్రిడ్ ద్వారా.. నియోజకవర్గంలోని అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా.. పెండింగ్ లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సదుపాయం, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. అన్ని గ్రామపంచాయతీల్లో క్లోరినేషన్ సిస్టమ్ ను, ఎఫ్.టి.కె. పనితీరు, నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తాగునీరు కలుషితం అయినట్లు సమాచారం అందితే సంబందిత అధికారులపై శాఖ పరంగా చర్యలు తప్పవన్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ సిస్టమ్ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని రకాల పి.డబ్ల్యు.ఎస్, ఎంపీడబ్ల్యూఎస్, డిపి స్కీములు, సీపీడబ్ల్యూఎస్ స్కీముల నిర్వహణను పటిష్టం చేయాలన్నారు. ప్రతి ఒక్క ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్‌లను ఎక్కడా కూడా లీకేజీలు లేకుండా సరఫరా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డీపీఓ రాజ్యలక్ష్మి, డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, ఆర్డబ్ల్యూయస్ ఈఈ ఏడుకొండలు, ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ రమణ, పంచాయతీరాజ్, డిఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ శాఖ, ప్రజారోగ్య శాఖ, భూగర్భజలాలు, ఫారెస్ట్ సబ్ డివిజన్ తదితర అధికారులు పాల్గొన్నారు.





## కలెక్టర్లతో విసి ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ అధికారి సమీక్ష

కడప నవంబర్ 6 ప్రభాతవార్త :

రాష్ట్రంలో నిర్వహించాల్సిన "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్" ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ కార్యక్రమ కార్యాచరణ ప్రణాళికపైపై.. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుండి.. రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి కడప జిల్లా కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, ఎన్నికల సెక్షన్ సిబ్బంది తదితర అధికారులు హాజరయ్యారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, ఆంధ్ర ప్రదేశంలో నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ కార్యక్రమంపై.. పలు మార్గదర్శకాలను వర్చువల్ విధానంలో జిల్లా ఎన్నికల అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. SIR-2025 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి అర్హత ఉన్న పౌరుడు ఓటర్‌ల జాబితాలో నమోదు కావడం, అనర్హులు తొలగింపు చేయటం, జాబితా పారదర్శకంగా ఉండటం లక్ష్యంగా చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ జిల్లా కలెక్టర్లకు సూచించారు.



## పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

దువ్వూరు, నవంబర్ 06, ప్రభాతవార్త:

మండల పరిధిలోని జాతీయ రహదారి ప్రక్కన గుడిపాడుకు సమీపంలో జియో కంపెనీకి అవసరమైన పెట్రోల్ బంకు స్థలాన్ని జమ్మలమడుగు ఆర్డీవో సాయి శ్రీ గురువారం పరిశీలించారు. జియో కంపెనీ ఆ స్థలంలో 5జి నెట్వర్క్ కు సంబంధించిన నిర్మాణాలు పూర్తి చేసుకొని వాటికి అవసరమైన పెట్రోల్ బంకును ఏర్పాటు చేసుకుంటున్నారు. అందులో భాగంగా జియో కంపెనీ ధరఖాస్తు చేసుకోగా వాటిని పరిశీలించారు. పెట్రోల్ బంకు నిబంధనల మేరకు ఉన్నాయా లేదా మిగతా విషయాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సంజీవరెడ్డి, ఆర్ఐ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



# పోలింగ్ బూత్‌ల విస్తరణపై సమీక్ష

**పీలేరు నవంబర్ 6 ప్రభాతవార్త:**



మాట్లాడుతున్న పీలేరు తహశీల్దారు

పీలేరు నియోజకవర్గం పరిధిలో పోలింగ్ బూత్‌ల విస్తరణపై ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు తహశీల్దారు శివకుమార్ తెలిపారు. పోలింగ్ బూత్‌ల విస్తరణలో సాధ్యసాధ్యాలపై అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ, ఎన్నికల అధికారులతో డిఆర్‌ఓ మధుసూదన్ రావు కాన్ఫరెన్స్ కాల్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగానే స్థానిక తహశీల్దారు కార్యాలయంలో పీలేరు, గుర్రంకొండ తహశీల్దార్లు శివకుమార్, లక్ష్మీప్రసన్నల ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో సమీక్షలో పీలేరు మండలంలోని మండల, గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలికిరి సీనియర్ అసిస్టెంట్ శాంత కుమార్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్, పీలేరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురుగయ్య, విలేజ్ రెవెన్యూ అధికారులు హేమంత్ నాయక్, సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, సిబ్బంది నాగేంద్ర, జయంతి, కళ్యాణి, శిరీష, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోడ్డు సొగసు చూడతరమా..

**కలికిరి, నవంబరు 6, ప్రభాతవార్త:**



మండలంలోని మేడికుర్తిలో ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ హైస్కూలుకు వెళ్లే రహదారి గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సిమెంటు రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఇటీవల కురిసిన వర్షపు నీరు, మురుగునీరు చేరి దుర్గంధంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు వెళ్తుంటారు. గుంతలకు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి అటు ప్రజలు, విద్యార్థుల కష్టాలు తీర్చాల్సి ఉంది.

# ధ్వంసమైన నిమ్మచెట్లు, కోళ్లఫారం షెడ్డు పరిశీలన



**జమ్మలమడుగు, నవంబరు 6, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు మండలం పి.బొమ్మేపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో కూటమి నాయకుల ఒత్తిడితో ప్రభుత్వ రెవెన్యూ అధికారులు గత 3 సంవత్సరా వయసు గల నిమ్మచెట్లను, కోళ్ల ఫారంను ధ్వంసం చేసిన విషయం తెలుసుకుని నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ భూమిని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గ్రామాల్లో రైతులపై కక్షపూరిత చర్యలు చేస్తే రాబోయే కాలంలో కూటమి నాయకులు తప్పక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. రైతులకు మరియు కార్యకర్తలకు నష్టం కలిగించే విషయాలను కానీ పనులను కాని ప్రోత్సహిస్తే సహించేది లేదని ఇబ్బందులకు గురైన నాయకులు, కార్యకర్తలకు వైసీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తదనంతరం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

**సంబేపల్లి నవంబర్ 6 ప్రభాతవార్త**

మండల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని గురువారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి సోదరులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అన్నారు తెలుగుదేశం నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 1.67కోట్ల తో సంబేపల్లి నుండి వడ్లపల్లి కి వెళ్లే దారి నర్సారెడ్డి గారి పల్లి నుండి కొటకాడపల్లె సబ్ స్టేషన్ వరకు 6 కిలోమీటర్లు తారు రోడ్డు పనులను పూర్తి చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కూడా రాయచోటి నియోజకవర్గంలో రహదారులు పై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారు.అదే విధంగా ప్రతి సమస్యను కూడా పరిష్కరిస్తూ నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశులు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతులేని ప్రచార యావతోనే విమర్శలు

**ప్రొద్దుటూరు నవంబర్ 6 ప్రభాతవార్త**




ప్రొద్దుటూరులో గత మూడు రోజులుగా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కేవలం అంతులేని ప్రచారయావతోనే నిత్యం తమపై విమర్శలు చేస్తున్నారు తప్ప మరొకటి కాదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజు ప్రతి అంశంపై ఎమ్మెల్యే వరద, తమపై విమర్శలు చేస్తేనే రాచమల్లు కు ప్రచారం వస్తుందా అని ప్రశ్నించారు. నిజంగా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాలు చేస్తే ప్రజలు హర్షిస్తారు తప్ప కేవలం లొల్లికోసమే చేయడం సరికాదన్నారు. ఏదేమైనా మున్సిపల్ ఆదాయానికి గండి పడకూడదన్న సదుద్దేశంతో దీక్షలు చేయడం మంచిదన్నారు. ఎగ్జిబిషన్ వేలంపాటలో బ్రతికించుకున్న ఏ గుత్తేదారుడైన మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సిందేనన్నారు. దానికి తాము కూడా విరుద్ధం కాదన్నారు. కానీ గత పదేళ్లుగా ఎగ్జిబిషన్ నిర్వహించిన గుత్తేదారుల బకాయిలపై ఎందుకు మోనం దాల్చావని ప్రశ్నించారు. ప్రధానంగా 2019 24 వరకు ఉన్న వైసీపీ పాలనలో కూడా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ బకాయిలు పెట్టిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. తాను కానీ ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి కానీ ఏనాడు అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించిన పరిస్థితి లేదన్నారు. అలాంటి వాటిపై వచ్చే ఆదాయంతో తాము బతికే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు విఎస్ ముక్తియార్, వద్ది బాలుడు తలారి రమేష్ రిటైర్డ్ ఎస్ఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**రాజుపాళెం, నవంబర్ 06, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గ్రామపంచాయతీలో ప్రజా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాల అమలు తీరు, అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని ఎంపీడీవో రామనాథరెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో గ్రామాలలో ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల పనితీరు అమలుపై గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రామనాథరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా త్రాగునీరు, పారిశుద్ధం సంక్షేమ పథకాలు అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. గ్రామ సచివాలయంలోని అధికారులు అందరూ వారి వారి బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన తెలిపారు. పంచాయతీల్లో నిర్వహించే విధివిధానాలను అనుసరించి ఆయా కార్యక్రమాలు నిర్వహించి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి షాకీర్ అలీ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

**మైదుకూరు, నవంబర్ 06, ప్రభాతవార్త:**



మైదుకూరు మున్సిపాలిటీని పార్టీలకతీతంగా అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామని శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. పురపాలక సాధారణ సమావేశానికి మున్సిపాలిటీ చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామని అంతేకాకుండా మున్సిపాలిటీలో 24 వార్డులలో డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీరు సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రజల ఆకాంక్ష మేరకు తాను పనిచేస్తానన్నారు. అధికారులు కూడా విధులలో అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పారిశుద్ధ్య కార్మికులు, పంపు ఆపరేటర్లకు జీతాలు పెంపుపై ఎమ్మెల్యే హర్షించారు. వార్డుల్లో ఎక్కడ అపరిశుభ్రత లేకుండా పనిచేయాలని నిర్లక్ష్యం వహించిన కౌన్సిలర్ మాట వినకుండా ఉన్న చర్యలు తప్పవని హెచ్చరించారు. వీధి కుక్కలు పట్టుకోవడానికి కాంట్రాక్టర్ దక్కించుకున్న వారు ఎక్కడ ఎన్ని పట్టుకున్నారో సమాచారం కావాలని అంతే కాకుండా ప్రత్యేక అధికారితో పర్యవేక్షణ కూడా ఉండాలని కోరారు. వార్డు కౌన్సిలర్లు పలు సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో పార్టీలకతీతంగా సమస్యలు పరిష్కరిస్తామని ఏదైనా సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకురావాలని వెంటనే చర్యలు చేపడతామని కూడా హామీ ఇచ్చారు. అజెండాలో చేర్చిన అభివృద్ధి కార్యక్రమాలను అందరి అనుమతితో ఆమోదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీ పరిధిలో సిసి రోడ్డు ప్రారంభం

పట్టణ మున్సిపాలిటీలోని నంద్యాల రోడ్డు అనుకుంటలో సిమెంట్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో అనేకచోట్ల ఇప్పటికే సిమెంట్ రోడ్లు వేస్తున్నామని ప్రజలకు ఇబ్బంది కరంగా ఉన్న చోట కూడా వేయడానికి చర్యలు తీసుకుంటామని అభివృద్ధి పథంలో ఇంకా చేయాల్సినవి ఉన్నాయని మైదుకూరు పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలియజేస్తూ సిమెంట్ రోడ్లు నాణ్యతతో కూడిన పనులు చేయాలని ఏఈ నిరంజన్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల భవనాన్ని తొలగించాలనడం కక్ష సాధింపే



**ప్రొద్దుటూరు నవంబర్ 06 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలోని టాప్ పాయింట్ జూనియర్ కళాశాల భవనాన్ని తొలగించాలని కేవలం కక్ష సాధింపు చర్యలలో భాగమేనని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా విమర్శించారు. గురువారం ఆయన చేపట్టిన రిలే దీక్షా శిబిరం నుండి విలేకరులతో మాట్లాడుతూ రోడ్ల విస్తరణలో భాగంగా మున్సిపల్ నిబంధనల మేరకు కళాశాల భవనాన్ని తొలగించాలని ప్రయత్నం చేడపై ఆయన మండిపడ్డారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి మున్సిపాలిటీ నిబంధనలు వర్తించవా అని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయం కింద షాపింగ్ కాంప్లెక్స్ ఉందని, పైన కార్యాలయం ఉందన్నారు. ఈ ప్రకారం డీవియేషన్ జరిగినట్లే కదా అని తెలిపారు. మోడంపల్లె బైపాస్ రోడులో పేస్ ఐఐటీ టాప్ మైండ్ జూనియర్ కళాశాలను తొలగించడానికి ఆయన కేవలం వైఎస్సార్సీపీ సానుభూతిపరుడు కావడమేనన్నారు. ఈ విషయంపై టీడీపీ సీనియర్ ముస్లిం నాయకుడిని ఆశ్రయించినా ఫలితం లేదని, కేవలం మూడు అడుగులు స్థలం వద్దే వివాదం ఉందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇప్పటికీ ఆన్లైన్లో పాత మ్యాపే ఉందని తెలిపారు. 1993లో ఇక్కడ భూ సేకరణ జరిగిందని, 2006లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అవార్డు పాస్ అయిందన్నారు. ఈ కారణంగానే కొనుగోలుదారులు మ్యాప్ చేసి కొనుగోలు చేస్తున్నారన్నారు. వాస్తవానికి ఈ రోడ్డు 100 అడుగులు నిర్మించడం లేదని, 60 అడుగులు నిర్మించేందుకే టెండర్లు నిర్వహించారన్నారు. అది కూడా రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద నుంచి సబ్ స్టేషన్ వరకు రోడ్డు నిర్మించేందుకే నిధులు మంజూరయ్యాయని, దీనిని బట్టి కేవలం కక్షపూరితంగానే కళాశాలను తొలగించేందుకు చర్యలు తీకున్నారన్నారు. ఆర్టీపీ పైపులైన్ను ఎలా తొలగిస్తారని, హై టెన్షన్ విద్యుత్ లైన్ తొలగించకుండా ఎలా పనులు చేపడుతారని ప్రశ్నించారు. గతంలో జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద జెండా చెట్టుకు సంబంధించిన అంశం కేవలం కాంట్రాక్టర్ వల్లే జరిగిందని, తర్వాత కౌన్సిలర్లమంతా కలిసి ఎమ్మెల్యే రాచమల్లును సంప్రదించడంతో జెండా చెట్టు యధాస్థితిలో ఉంచారన్నారు. మైదుకూరు రోడ్డులోని జెండా చెట్టు ఏమైందని ముక్తియార్ను ప్రశ్నించారు. ముందు కొట్టాల్సి వస్తే రిలయన్స్ మార్ట్ వద్ద ఆక్రమణలను తొలగించాలని తెలిపారు.

# నిరుద్యోగ భృతి ఎక్కడ

**పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న వారు ఇచ్చిన హామీలను విస్మరించి సామాజిక పెన్షన్లు మాత్రమే ప్రతినెలా చూపిస్తూ సొంత డబ్బా కొట్టుకుంటూ నిరుద్యోగులను గాలికి వదిలేసిన వైనం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి సభ్యులు పోరుమామిళ్ల మండల అధ్యక్షులు అన్వర్ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు చెల్లుబాటు కానీ అనేక హామీలను ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతి, మహిళలకు ప్రతినెల 1500 రూపాయలు ఆర్థిక భరోసా, 50 సంవత్సరాలకె ఓబీసీలకు పెన్షన్ లాంటి అనేక సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి సామాజిక పెన్షన్లను మాత్రమే ప్రతినెలా చూపిస్తూ సొంత డబ్బా కొట్టుకుంటూ ఆనందపడుతున్న కూటమి ప్రభుత్వానికి ఇవన్నీ కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. గత పాలకుల వైఫల్యాలను చూపిస్తూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అదే వైఫల్యాలను చేస్తూ ఏ విధంగా రేపు స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు వెళతారని ఆయన ప్రశ్నించారు. రేపు స్థానిక సంస్థల్లో కచ్చితంగా ప్రజలు మీకు గుణపాఠం చెబుతారని ఇప్పుడైనా మీరు చెప్పిన ప్రతి హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల ఉద్యమం

**పోరుమామిళ్ల రూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త:**

పోరుమామిళ్ల టౌన్ తంబాబా వీధిలో జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ రాళ్లపల్లి నరసింహులు ఆధ్వర్యంలో గురువారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే లు మాట్లాడుతూ ప్రజా వైద్యం ప్రజల హక్కు అనే నినాదంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం ప్రారంభించిందన్నారు. ప్రజారోగ్య రంగాన్ని చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆరోపిస్తూ, వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సంస్కరణలను రద్దు చేసి, ప్రజలకు ఉచిత వైద్యం అందించే ప్రభుత్వ ఆస్పత్రులను, మెడికల్ కాలేజీలను ప్రైవేటు బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శిస్తోందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019-24 మధ్య రాష్ట్ర వైద్యరంగాన్ని సువర్ణ యుగంలోకి తీసుకెళ్లిందని పార్టీ పేర్కొన్నారు. రూ.9,480 కోట్లతో 7 కొత్త మెడికల్ కాలేజీలు, 10,032 విలేజ్ క్లినిక్స్, 528 అర్బన్ క్లినిక్స్, 125 పీహెచ్‌సీలు, 168 సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల బలోపేతానికి భారీగా నిధులు ఖర్చు చేశారన్నారు. 5 కొత్త గిరిజన మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులు, పలాసలో కిడ్నీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, 5 సూపర్ స్పెషాల్టీ బ్లాక్స్, 6 క్యాన్సర్ సెంటర్లు, 3 హార్ట్ హబ్‌లు, 108-104 సర్వీసులకు వందలాది వాహనాలు వంటి కార్యక్రమాలు ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రాజీవ్ భాష, గాజుల పల్లె రవిచంద్ర రెడ్డి, వారితోపాటు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఉద్దిమడుగు జలాశయ భూములు పరిశీలన



**సిద్దవటం నవంబర్ 6 ప్రభాతవార్త**

మండలంలోని ఉద్దిమడుగు జలాశయ భూములను గురువారం పరిశీలించినట్లు తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మందపల్లి గ్రామంలోని పాత కట్టడాలను, ఉద్దిమడుగు జలాశయానికి ముంపుకు గురయ్యే పరిహారం పొందని పట్టా భూములను మొదటి విడతగా పరిశీలించామన్నారు. అలాగే పట్టా భూములకు సంబందించిన రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. పరిహారం పొందని పట్టా భూములు పరిశీలించిన అనంతరం అసైండ్ భూములు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎన్ని ఎకరాలు ముంపుకు గురవుతాయో భూములకు సంబందించిన నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్ కు సమర్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ హరిక్రిష్ణ, గ్రామ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

# స్దలం హద్దులు తేల్చాలని వినతి



**సిద్దవటం నవంబర్ 6 ప్రభాతవార్త**

సిద్దవటం మండలం మాధవరం1 గ్రామ పంచాయతీ యస్.కె.ఆర్ నగర్లోని చేనేత క్లస్టర్ స్దలం అన్యాక్రాంతం అవుతుందని దయచేసి మా చేనేత క్లస్టర్ స్దలం హద్దులు తేల్చి స్దలం అన్యాక్రాంతం కాకుండా సర్వే నెంబర్ 10693 , 10695 లలో 1.7 సెంట్లు 905లో 0.35 గల భూమిని ఆన్ లైన్ చేయాలని స్దానిక చేనేత కార్మిక నాయకుడు శ్రీరాందాసు వెంకట్ సిద్దవటం తహసీల్దారు ఆకుల తిరుమల బాబుకు గురువారం వినతిపత్రం అందచేశారు.

# కె.ఎస్.ఆర్.ఎంకు

# గ్లోబల్ ఎడ్యుకేటర్స్ ఎక్సలెన్స్ అవార్డ్ - 2025"



**కడప, నవంబర్ 6 (ప్రభాత వార్త):**

బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టీహబ్ ప్రాంగణంలో జరిగిన గ్లోబల్ ఎడ్యుకేటర్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2025 కార్యక్రమంలో కడపకు చెందిన కె.ఎస్.ఆర్.ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో హెచ్ ఎస్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ చౌటూరు మనోజ్ కుమార్"ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్" అందుకున్నారు.విద్యా మరియు పరిశోధన రంగాలలో ఆయన కనబరిచిన నిరంతర కృషి, సృజనాత్మక ఆలోచనలకు గాను ఈ గౌరవం లభించినట్టు కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ.ఎన్. ప్రసాద్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కాలేజీ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ,"డాక్టర్ మనోజ్ కుమార్ ప్రయోగాత్మక బోధన పద్ధతులు విద్యార్థులకు స్ఫూర్తి నింపుతున్నాయి. ఈ అవార్డు కె.ఎస్.ఆర్.ఎం కళాశాలకు గౌరవం తీసుకొచ్చింది" అని అభినందించారు. తన అనుభూతిని వ్యక్తం చేస్తూ డాక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ,"విద్యా రంగంలో మరింత సేవ చేయడానికి నేను కట్టుబడి ఉన్నాను" అని తెలిపారు. ప్రతిక్షణం మమ్మల్ని ప్రోత్సహిస్తూ మాకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న కళాశాల యాజమాన్యానికి రుణపడి ఉంటామని తెలిపారు.

# పిహెచ్సిని సందర్శించిన జనసేన నేతలు

**వేంపల్లి: నవంబర్ 06:(ప్రభాత వార్త)**

స్థానిక పిహెచ్సి కేంద్రాన్ని జనసేన సీనియర్ నేత డా.దాసరి రవిశంకర్ గురువారం సందర్శించారు. మౌలిక వసతులు, ఇతరత్రా వాటిపై పిహెచ్సి వైద్యురాలు డా.వాణి తో కలిసి ఆరాతీసారు. పిహెచ్సిలో రెండు స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏఎన్ఎం, బిఎస్సీ నర్సింగ్ పూర్తైన వారు అర్హులని డా.వాణి, ఆయన దృష్టికి తెచ్చారు. గర్భిణీ స్త్రీలకు సాధారణ కాన్పులు చేస్తున్నామని, నాణ్యమైన మందులు, చిన్న పిల్లలకు కూడా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు టెక్నీషన్ ద్వారా ల్యాబ్, ఇసిజీ తదితర వాటిపై కూడా వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు నాగ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



# దువ్వూరు ఎస్ఐ బదిలీ

**దువ్వూరు, నవంబర్ 06, ప్రభాతవార్త:**

దువ్వూరు పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గా పనిచేస్తున్న వినోద్ కుమార్ బదిలీ అయ్యారు. ఆ మేరకు గురువారం పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వినోద్ కుమార్ బదిలీ కాగా ఆయన స్థానంలో పొద్దుటూరు 2టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ గా పని చేస్తున్న ధనుంజయడును దువ్వూరు ఎస్ఐగా నియమించారు. ఆయన త్వరలో బాధ్యతలు చేపడతారని తెలుస్తోంది.

# నిలకడ లేని మొక్కజొన్న ధర



**దువ్వూరు, నవంబర్ 06, ప్రభాతవార్త:**

మండల పరిధిలో సుమారు 2500 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. అయితే ధరలు నిలకడ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దిగుబడి వచ్చే సమయంలో వర్షాలు రావడం అందులో తేమశాతం ఎక్కువగా ఉందని చెప్పి మరి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. మండలంలో నీలాపురం, దాసరి పల్లె, చిన్నసింగన పల్లె, గుడిపాడు, దువ్వూరు ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో ఈ ఏడాది మొక్కజొన్న పంటలు సాగు చేశారు. గత 15 రోజుల నుండి మొక్కజొన్న విత్తనాల పంట తీస్తున్నారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాల్ కు 2400 చెల్లించి కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆ విధంగా మద్దతు ధర కూడా ప్రకటించారు. అయితే ముందుగా వర్షాలు లేని సమయంలో వ్యాపారస్తులు ఆ ధరకు కొనుగోలు చేశారు. అనంతరం వర్షాలు రావడం విత్తనాలు తడిసిపోయాయని చెప్పి ధర తగ్గిస్తున్నారు. ప్రస్తుతం 2400కు కొనుగోలు చేసిన మొక్కజొన్న 1400కు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. అందులో తరుగు పేరుతో 100 కేజీలు తీసుకోవాల్సి ఉండగా 103 కేజీలు తీసుకుంటూ రైతులను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలుకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఉంటే రైతులకు కొంత ప్రయోజనం ఉండేది. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో వ్యాపారులు, దళారులు ఇష్టం వచ్చిన రీతిలో మొక్కజొన్న రైతులను దోపిడీ చేస్తున్నారు. వీరిని ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వం పైన ఉంది.

# కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు




**వేంపల్లె:నవంబర్ 06:(ప్రభాత వార్త)**

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి వెల్లడించారు. గురువారం ఆ పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థిని బొమ్మిరెడ్డి అర్చనా రెడ్డిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని తమ పాఠశాలలో 2015 విద్యా సంవత్సరం పదోతరగతి పూర్తి చేసిందని, తన విద్యా ప్రసానంలో నిరంతర కృషి, క్రమశిక్షణతో చార్టర్డ్ అకౌంట్(సీఏ) సాధించడం పట్ల పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థిని అర్చనా రెడ్డి కృషి, క్రమశిక్షణ.. ప్రతి విద్యార్థికి ఆదర్శమన్నారు. అలాగే విద్యార్థిని తల్లిదండ్రులు బి.రాఘవరెడ్డి, బి.అరుణ లు మాట్లాడుతూ తమ కుమార్తె సాధించిన విజయం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ విజయానికి పాఠశాల బోధన, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమన్నారు. విద్యార్థిని సాధించిన విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి, అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# మండల అభివృద్ధికి నిధులు కేటాయించండి

**వేంపల్లె:నవంబర్ 06:(ప్రభాత వార్త)**



వేంపల్లె మండల అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. విజయవాడలో ఉన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కలిసి వేంపల్లె మండలంలో ఉన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో వేంపల్లెలో ఉన్న రోడ్ల అన్ని ధ్వంసం చేశారని దీంతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. రోడ్డు వెడల్పు పనులు కూడ నిదానంగా జరుగుతుండడం వలన వ్యాపారస్తులకు చాలా ఇబ్బందిగా మారిందని చెప్పారు. పనులు వేగవంతంగా జరిగేందుకు నిధులు ఎక్కువగా విడుదల చేయాలని కోరారు. రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు జిఎన్ ఎస్ ఎస్ ద్వారా ముచ్చుకొన చెరువు మీదుగా పాపాఘ్ని నదికి నీటిని విడుదల చేయాలని కోరారు. పాపాఘ్ని నదికి నీటిని విడుదల చేయడం వలన కమలాపురం వరకు సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ సమస్య తీర్చేందుకు వేంపల్లె ప్రాంతంలో పరిశ్రమను కూడ నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. రాబోవు పంచాయతీ ఎన్నికల్లో బీటెక్ రవి సారధ్యంలో పులివెందుల నియోజకవర్గంలో టిడిపి జెండాను . ఎగుర వేసేందుకు సిద్దంగా కార్యకర్తలు అందరూ ఉన్నారని కార్యకర్తల సంక్షేమం కోసం కూడ పార్టీ తరుపున దృష్టి పెట్టాలని కోరారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని మంత్రి లోకేష్ చెప్పినట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి మండలం అభివృద్ధికి నిధులు తప్పకుండా మంజూరు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. టిడిపి పార్టీ జెండాను ఎగుర వేసేందుకు ప్రతి కార్యకర్త కూడ పని చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను టిడిపి పార్టీ మరవదని పార్టీ పదవులు ఇచ్చి గౌరవిస్తామని లోకేష్ చెప్పినట్లు తెలిపారు. ప్రజా సమస్యలు కూడ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

# తేజోమయంగా మహాజ్యోతి ప్రజ్వలన

**పులివెందుల నవంబర్ 6 ప్రభాత వార్త :**



కార్తీక మాసం పురస్కరించు కొని శ్రీ కోన గవేశ్వర స్వామి క్షేత్రంలో తేజోమయంగా మహా జ్యోతి ప్రజ్వలన ,దీపాలంకరణ కార్యక్రమం జరిగింది. గురువారం ఈ కొత్తపల్లి పంచాయతీ లోని మొత్నూతల పల్లి గ్రామం వద్ద వెలసిన స్వయం భూ కోన గవేశ్వర స్వామి మూల విరాట్ ను ఆలయ పండితులు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ,గ్రామపెద్దలు కలిసి దేవస్థానం నందు మహా జ్యోతి ప్రజ్వలన మరియు దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఓం ,మరియు దేవస్థానంలో దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్ర మానికి పెద్ద ఎత్తున భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.భక్తులు స్వామి వారికి కాయ కర్పూరాలు సమర్పించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





## ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉలవలు మంజూరు

రామాపురం నవంబర్ 6 ప్రభాతవార్త



మండలంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సబ్సిడీ కింద 250 క్వింటాళ్ల ఉలవలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలియజేశారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయుటకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో ఉలవలు 250 క్వింటాళ్లు మండలానికి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 10 కేజీలు రూ 550లు రైతు వాటా రూ112 ప్రభుత్వ సబ్సిడీ రూ448 ఉలవ పంట సాగు చేయదలసిన రైతులు గ్రామ పంచాయతీలోని ఐదుగ్రామ పంచాయతీలోని రైతు సేవ కేంద్రాల వద్దకు ఆధార్ కార్డు భూమి పట్టాదారు పాస్ బుక్ తీసుకెళ్లి రైతు వాట చెల్లించి ఉలవల ప్యాకెట్ రైతులు తీసుకొని బయట అమ్ముకోకుండా దుర్వినియోగం చేసుకోకుండాపంట సాగు చేసి ఈ క్రాప్ నమోదు చేయించుకొవాలన్నారు.

## రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంట్ స్తంభం తొలగింపు

లక్కిరెడ్డిపల్లి : నవంబర్ 06 ప్రభాత వార్త



మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వీధిలో చాలా సంవత్సరాలుగా కరెంటు స్తంభం రోడ్డుకు అడ్డంగా ఉన్నది. దీంతో ఆ వీధిలో ఉన్న స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులకు గురైయ్యేవారు. ఎన్నోసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదన్నారు. అయితే స్థానిక ప్రజలు ఈ మధ్యకాలంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ఎం.డి.షఫీ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిల ఆదేశాల మేరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి తన సొంత నిధులతో రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంటు స్తంభాన్ని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు చివరికి మార్పించారు.

## నిధులు కేటాయించడంలో జాప్యమెందుకో..

లక్కిరెడ్డిపల్లి; నవంబర్ 06 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీలలో తాగునీటి సమస్య ఉందని, సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, అన్నారు గురువారం, రెడ్డివారి పల్లి పంచాయతీ పరిధిలోనే బాట మాదిగపల్లె ఉన్న తాగునీటి సమస్యపై మహిళలతో కలిసి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు, ఈ సందర్బంగా మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాపితంగా గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు, ఇప్పటికే అనేక గ్రామాలలో పబ్లిక్ బోర్లు చేతి పంపులు పేరు వచ్చి నెలలు గడుస్తున్న పంచాయతీ కార్యదర్శులు సర్పంచులకు చెప్పినప్పటికీ తమకు నిధులు రాలేదని గ్రామాలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా అవినీతి జరిగి ఉంటే విచారణ జరిపి ఆ సర్పంచ్ కార్యదర్శులపైన చర్యలు తీసుకోవాలని తప్ప, అన్ని గ్రామ పంచాయతీలకు నిధులను ఆపడం సబవు కాదన్నారు, ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు, స్పందించి నిధులు మంజూరు, చేయగలరని డిమాండ్ చేశారు.

## కళాశాలలో పరికరాల తరలింపు ఆపాలి

ఎడ్యుకేషన్, నవంబర్ 6, ప్రభాతవార్త

పులివెందల ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణలో భాగంగా కళాశాలలోని పరికరాలను కూటమి ప్రభుత్వం తరలించడం దారుణమని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పి.పి.పి పద్ధతిలో నడుపుతామని చెప్పి ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పేందుకు అడుగులు ముందుకు వేస్తుందన్నారు. గత ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందించాలని లక్ష్యంతో రాష్ట్రంలో నూతనంగా 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చి అందులో మొదటి దశలో నాలుగు మెడికల్ కళాశాలలో ప్రారంభించింది. మిగతా కళాశాలలో కూడా భవనాలు పూర్తి అయి గ్రామానికి సిద్ధంగా ఉన్న తరుణంలో రాష్ట్రంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తామని చెప్పి అందుకు చర్యలను వేగవంతం చేసిందన్నారు. పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని పరికరాల తరలింపును ఆపాలని గురువారం కడప కలెక్టరేట్‌లో డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడును కలిసి వినతి పత్రం సమర్పించారు.

## వేలంపాట ద్వారా 64.500 ఆదాయం

నిమ్మనపల్లి నవంబర్ 6 ప్రబాతవార్త

మండలంలోని పలు గ్రామపంచాయతీలకు వేలంపాట ద్వారా 64,500 ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో డిఎల్‌పిఓ నాగరాజు సర్పంచులు కార్యదర్శులు ఆధ్వర్యంలో పలు చెరువుల్లో చేపల పెంపకానికి బహిరంగ వేలం పాటను జరిపినట్లు తెలిపారు దాసరి వానికుంట 3000, బోడి కింద రాయిని చెరువు 12000 సీతాపతి చెరువు 25000 వీరప్ప నాయన చెరువు 22,000 మొరుపుకుంటా 2.5000 పలికినట్లు తెలిపారు.

## ఆలయ అభివృద్ధి కొరకై 50 వేల విరాళం

సిద్ధవటం నవంబర్ 6 ప్రభాతవార్త



రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త అతికారి కృష్ణ సేవా కార్యక్రమాలపై ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మండలంలోని మాధవరం గ్రామం, ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో గురువారం సీతారాముల ఆలయ అభివృద్ధి కొరకై 50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుతూ అతికారి కృష్ణ సేవలు మేము ఎప్పటికీ మరవలేని విషయమన్నారు. పార్లమెంట్ వాణిజ్య అధికారిక ప్రతినిధి ఎన్నారై చంద్ర మాట్లాడుతూ సేవా కార్యక్రమాల కొరకై పార్లమెంట్ సమన్వయకర్త కృష్ణ ఆధ్వర్యంలో ఎల్లవేళలా నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి యువ నేత శ్రీకాంత్, టిడిపి పార్లమెంట్ వాణిజ్య అధికారిక ప్రతినిధి ఎన్నారై చంద్ర, మన ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్, రవికుమార్, సింగల్ విండో మాజీ డైరెక్టర్ మురళి, ఎస్సీ కుటుంబాల నివాసులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

మదనపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త :



చైర్మెన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేయనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రజలు పలు సమస్యలు అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పిజిఆర్ఎస్‌లో విన్నవించే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అనంతరం సొసైటి బిల్డింగ్ అసోసియేషన్ చైర్మెన్‌గా ఎన్నికైన ఎస్ఆర్.షంషీర్, పాలకవర్గం కమిటీ సభ్యులను ఎమ్మెల్యే పుష్పగుచ్చం అందజేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. టౌన్‌బ్యాంకు చైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, డైరెక్టర్లు కలసి బిల్డింగ్ అసోసియేషన్ ఛైర్మెన్‌ను ఘనంగా సత్కరించారు. కొత్తగా నియామకమైన పాలకవర్గ సభ్యులు ప్రజాసమస్యల పరిష్కారానికి నిక్కచ్చిగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## కొండామర్రిపల్లెలో వైకాపాచే కోటి సంతకాలు

మదనపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త :



సంతకాలు సేకరణ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని కొండామర్రిపల్లె గ్రామంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17మెడికల్ కళాశాలలను మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం వీటిని పిపిపి విధానంతో ప్రైవేటుపరం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మదనపల్లె నియోజకవర్గ రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు అనూషారెడ్డి, కన్వనర్ కరుణాకర్ రెడ్డి, తట్టిశ్రీనవాసులురెడ్డి సర్పంచ్ దీపా వేమారెడ్డి, నాయకులు వెలుగు చంద్రా, ఇస్మాయిల్, మహేష్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, శ్యామల, నాగవేణి, జబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం ఐక్యవేదిక సలహాదారునిగా ఎస్‌కె.బాషా

మదనపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త :



ముస్లిం ఐక్యవేదిక అన్నమయ్య, కడపజిల్లాల గౌరవ సలహాదారులుగా డాక్టర్ ఎస్‌కె.బాషాను నియమిస్తూ రాష్ట్ర అద్యక్షులు జాఫర్ పులి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా డాక్టర్ ఎస్‌కె.బాషా మాట్లాడుతూ ముస్లింల ఐక్యతకు, అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింలు అన్నిరంగాల్లో చైతన్యవంతులు కావాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడపజిల్లా అధ్యక్షులు ఖాజా, ఇమాంబాషా, మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షులు ముబారక్, నియోజకవర్గ సలహదారులు ఖాదర్‌బాషాలు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మదనపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఒంగోలులో ఈనెల 15, 16వ తేదీల్లో జరిగే మున్సిపల్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.రమణ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల మీద ప్రతి ఏటా రాజీ పడకుండా పోరాటాలు ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చేస్తొందన్నారు. ఉద్యమాలతోనే వేతనాల పెంపు కార్యక్రమాన్ని సాధించుకొన్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరిన్ని ఉద్యమాలు చేపట్టనున్నటుల తెలిపారు. ఒంగోలులో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గంగయ్య, గోపాల్, శ్రీరాములు, రామక్రిష్ణలు పాల్గొన్నారు.

## వృధాగా పోతున్న నీటిని అరికట్టండి

కురబలకోట, నవంబర్ 6 ప్రభాతవార్త

కురబలకోట మండలం లోతు వంక (కొత్త చెరువు) తూము ద్వారా చెరువు నీళ్లు వెళ్లిపోతున్నాయి. పది చెరువు లోపల ఎక్కడో గండిపడి తూము ద్వారా పది రోజులుగా నీళ్లుపోతున్నాయి. ఇది చెరువు కట్టకు కూడా ప్రమాదం కరంగా మారే అవకాశం ఉంది. అంతేకాకుండా తూము ద్వారా నీళ్లు పోవడం వల్ల ఆయకట్టు కింద ఉన్న టమోటా, వేరుశనగ తదితర పంటలు పది ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఇరిగేషన్ అధికారులకు.. రెవెన్యూ, ఎంపీడీవో అధికారులకు , సచివాలయ ఉద్యోగులకు చెప్పామని రైతులు చెబుతున్నారు. వారి నుండి ఆశించిన స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## మాజీ సీఎంని కలసిన విద్యార్థి నాయకులు

పీలేరు, నవంబర్ 6 ప్రభాతవార్త:



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ కలిశారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిసి విద్యార్థుల సమస్యలపై విన్నవించారు. విద్యా వ్యవస్థకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వివరించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కిషోర్, నియోజకవర్గ అధ్యక్షులు లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

## హద్దులు దాటి మాట్లాడవద్దు : లింగారెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 6 ప్రభాతవార్త:



టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి గురువారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా వుంటే కేవలం మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి తుఫానులను కూడా చంద్రబాబు సృష్టించారనే విధంగా మాట్లాడటం అవివేకమన్నారు. కేవలం చంద్రబాబు 18 నెలల పాలనలో 16 సార్లు వర్షాలు వచ్చాయని మాట్లాడారని, గతంలో వర్షాలు రానిపక్షంలో రాలేదని వ్యాఖ్యానించారని, ప్రపంచం అంతా వర్షాలు వచ్చాయని, అది చంద్రబాబు విపత్తా అని ప్రశ్నించారు. గతంలో జగన్ సీఎంగా వుండి తానే క్రాఫ్‌లోన్ తానే చెల్లిస్తానని తెలిపి ఒకరికి కూడా పరిహారం రాకుండా చేశారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో పులివెందులలో అభివృద్ధి చేసిన డ్రిప్ ఇరిగేషన్‌ను కూడా జగన్ పాలనలో అటకెక్కించారని విమర్శించారు. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అనవసర విమర్శలు మానుకోవాలని సూచించారు. పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, మంత్రి లోకేష్‌ను అసభ్య పదజాలంతో విమర్శించారని, ఇది టిడిపి ప్రభుత్వమని గుర్తుంచుకొని మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కామిశెట్టి బాబు, షామీర్ బాష, టప్పా మహబూబ్ బాషా, రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు ఇప్పించాలంటూ వినతి

కలికిరి, నవంబరు 6, ప్రభాతవార్త:

కలికిరి ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు గత 5 నెలలుగా జీతాలు అందడం లేదని గురువారం కలికిరి ఆసుపత్రి తనిఖీకి విచ్చేసిన అన్నమయ్య జిల్లా డీసీహెచ్‌ఎస్ డా.ఆంజనేయులుకు కార్మికులు విన్నవించారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ వెంటనే స్పందించి కాంట్రాక్టరుతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే జీతాలు ఇవ్వాలని కాంట్రాక్టరును ఆదేశించడంతో ఆయన వెంటనే అందిస్తానని తెలిపారు.



డీసీహెచ్‌ఎస్‌కు విన్నవిస్తున్న కార్మికులు

## అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆదికి తగదు

ప్రొద్దుటూరు నవంబర్ 06, ప్రభాతవార్త



మాజీ సిఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆయన సతీమణి భారతమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి తగదని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. గురువారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదినారాయణ రెడ్డి బిజెపి కండువాతో గెలిచారా లేదా టిడిపి కండువాతో మాట్లాడుతున్నారో అర్థం కాలేదన్నారు. భారతమ్మకు ధన దాహం ఉందంటూ ఆరోపణలు చేస్తూ 400 కేజీలు బంగారు కొనుగోలు చేసిందని చెప్పడం సమంజసం కాదన్నారు. రాజకీయాలలో విమర్శలు చేయవచ్చుని కానీ కుటుంబంలోని స్త్రీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. తొందర్లోనే భారతమ్మ జగన్ జైలుకు పోతారని ఆది చేసిన వ్యక్తులపై ఆయన మండిపడ్డారు. కొన్ని జన్మలెత్తినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంతరించి పరిస్థితి లేదన్నారు. మరొకసారి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయన సతీమణి భారతమ్మలపై అసందర్భ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

## 11 మంది జూదరులకు జైలు శిక్ష

తంబళ్లపల్లె నవంబర్ 6 ప్రభాతవార్త :

పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతూ 2023 లో పోలీసులకు పట్టుబడిన 11 మంది పేకాట రాయుళ్లకు తంబళ్లపల్లి జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ గురువారం 7 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించి తంబళ్లపల్లె ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు తంబళ్లపల్లి మండల పరిధిలో పలువురు పేకాట ఆడుతూ 2023వ సంవత్సరం పట్టుబడుగా వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అప్పటి ఎస్సై అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో పూర్వాపరాలను విచారించిన న్యాయమూర్తి గురువారం నిందితులపై నేరం రుజువు కావడంతో 11 మంది ముద్దాయిలు కు 7 రోజులు జైలు శిక్షతోపాటు రూ 300 జరిమానా విధించినట్లు తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో మరో 30 రోజులు సాధారణ జైలు చేయాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

## ప్రమాద భీమా... కార్యకర్తలకు ధీమా

బద్వేలు, నవంబర్ 6, ప్రభాతవార్త



పార్టీ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రూపాయల ప్రమాద బీమా నేడు వారి కుటుంబానికి అండగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో ప్రమాదంలో చనిపోయిన పలువురు కార్యకర్తలకు 5 లక్షల జీవిత బీమా చెక్కులను ఆమె పంపిణీ చేశారు. చెక్కులు పొందిన వారిలో పార్టీ కార్యకర్తలైన వరికుంట్ల సుబ్బయ్య, పోతాపి చిన్నయ్య, ఎంబడి చెవురమ్మ, కూరాకు జయ సుబ్బారెడ్డిల కుటుంబ సభ్యులు ఉన్నారు. కార్యకర్తల సంక్షేమ నిధి నుండి మంజూరైన ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కులను అందజేశారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లకు తరుణ్

రామసముద్రం నవంబర్ 6ప్రభాతవార్త



గురువారం తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఉమ్మడి పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఎంపికలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెంబకూరు విద్యార్థి జె. తరుణ్ కుమార్ రాజు అద్భుతమైన ఆటతీరుతో కనబబరిచి అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతి ఎస్వీ క్రీడామైదానంలో జరిగిన అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి అండర్ 17 అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలియజేసారు.

## పరీక్షా కేంద్రాలు పరిశీలన

పీలేరు, నవంబర్ 6 ప్రభాతవార్త:



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మార్చి2026 లో జరగనున్న పదవ తరగతి పరీక్షల నిర్వాహణ కోసం అధికారులు పరీక్షా కేంద్రాలు పరిశీలించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరాజు, మదనపల్లె ఉప విద్యాశాఖ అధికారి లోకేశ్వరెడ్డి, సూపరింటిండెంట్ రవికుమార్, పరీక్షల విభాగ సిబ్బంది నాగరాజు మండలంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్. తాగునీరు, మరుగుదొడ్లు. ఫ్యాన్లు సక్రమంగా ఉన్నాయో లేవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలు అమ్మకానికి కాదు

తొండూరు నవంబర్ 6 ప్రభాతవార్త :



ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల దుమారం పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో, ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలోపేతం కావాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సంతకాల సేకరణ కార్యక్రమం తొండూరు మండలంలో వేడెక్కింది. గ్రామాలు, పట్టణాలు – ఎక్కడ చూసినా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేస్తూ ప్రభుత్వ వైద్య విద్యకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు బలహీనపడే ప్రమాదం ఉంది. ఈ ఉద్యమాన్ని వైఎస్సార్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజాసంస్థలు, మహిళా సంఘాలు కలిసి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తూ సంతకాలు సేకరిస్తున్నారు.

## కూటమి దగా పాలన : మాజీ ఎమ్మెల్యే

పీలేరు నవంబర్ 6 ప్రభాతవార్త:



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దగా చేస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పీఏసీ సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం వాల్మీకిపురం లో జరిగిన వైసీపీ మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలకులు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కేవలం డైవర్షన్ పాలిటిక్స్, వైసీపీ శ్రేణులపై వేధింపులు, తప్పుడు కేసులు అక్రమ అరెస్టులతో పాలన సాగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేదలు, గ్రామీణ ప్రజల పిల్లలకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తూ దగా చేస్తోందన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చర్యల పట్ల ప్రజా సంఘాలు, ప్రజలు కూడా తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారని, వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి ఉద్యమాన్ని సాగిస్తోందన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు పులి శివారెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బిడ్డల కేశవ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, జిల్లా టెలికం సభ్యుడు నిర్థాల శ్రీధర్ రాయల్, మాజీ డైరెక్టర్ నరసింహులు, వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, మైనారిటీ విభాగం జిల్లా కార్యదర్శి కువైట్ ఇబ్రహీం, మండల కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, న్యాయ విభాగం అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రమేష్, రాజబాబు, రఘు, చికెన్ మస్తాన్, సైఫుల్లా, టైలర్ బాష, జాకీర్, సమీ, చలపతి, శ్రీనివాసులు, శేఖర్ నాయుడు, అల్లీ, అమిన్ పీర్, రాయుడు, ఎల్లారెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

గాలివీడు, నవంబర్ 6(ప్రభాతవార్త):



నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడం జరుగుతున్నదని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు అందజేసిన విద్యార్థులకు భోజనపు ప్లేట్లు పంచాయతీ కార్మికులకు వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. త్వరలోనే జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహారీగోడను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్‌రియాజ్, ప్రభాకర్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మల్లిఖార్జున, మాజీ ఎంపీటీసీలు చినరెడ్డి, శేషారెడ్డి, టీడీపీ నాయకులు రామమోహన్ నాయుడు, నాగేశ్వరరావు, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నరసారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

పీలేరు నవంబర్ 6 ప్రభాతవార్త:



పంటను పరిశీలిస్తున్న దృశ్యం

పీలేరు నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లాలో మొంథా తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, పంట నష్టపరిహారం చెల్లించాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి మహేష్ ప్రభుత్వాన్ని కోరారు గురువారం వాయల్పాడు మండలం, తిటిగుంటపల్లి గ్రామం, మూరేవాండ్లపల్లి పంచాయతీ టేకులకోనలో టమోటా, బొప్పాయి పంటలను సీపీఐ ఏపీ రైతు సంఘం నాయకులు పరిశీలించారు ఈ సందర్బంగా మహేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ మొంథా తుఫాను సృష్టించిన భీభత్సం వలన నష్టపోయిన రైతాంగాన్ని, తుఫాను బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ దేవరా, ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, రైతులు రామకృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ

కలికిరి, నవంబరు 6, ప్రభాతవార్త:



రికార్డులు పరిశీలిస్తున్న ఆంజనేయులు

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం అన్నమయ్య జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డా.ఆంజనేయులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ, ఐపీ, డెలివరీలు, ఈహెచ్‌లు, ఎన్టీఆర్ వైద్యసేవలు, ఏబీహెచ్ఎ, ఎఫ్ఆర్ఎస్ ల్యాబ్ ఫార్మశి ఆపరేషన్ థియేటర్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ ఎన్టీఆర్ వైద్య సేవలను పెంచాలని వైద్య సేవలను మరింత వేగవంతం చేయాలని వైద్యాధికారులను డీసీహెచ్ఎస్ ఆదేశించారు. అదే విధంగా కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెపోటుకు సంబంధించి రూ.45వేలు విలువ చేసే టెలెక్టోప్లేస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెపోటు సమయంలో ఈసీజీ చేసి అవసరమైతే ఇంజక్షన్లు ఇస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలికిరి ఆసుపత్రి సూపరింటెండెంట్ పవన్‌కుమార్, వైద్యాధికారులు డా.ఉదయ్‌కిరణ్, ఆశాలత, సిమ్రాన్, హెడ్ నర్సు వనజమ్మ, ఫార్మాశిస్టు మొహిద్దీన్, రేడియోగ్రాఫర్ వెంకటరమణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

కలికిరి, నవంబరు 6, ప్రభాతవార్త:



రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడంపై వ్యతిరేకంగా గురువారం కలికిరి పంచాయతీ వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎం.ఐ.హనీఫ్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా హనీఫ్ గ్రామంలో పర్యటిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసిన జనసేన నేత శ్రీనివాసరాజు

నందలూరు, నవంబరు6 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ని జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా కొన్ని విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వారితో పాటు నాగిరెడ్డి పల్లె మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, వినోద్ వర్మ తదితరులు కలిశారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

ఖాజీపేట, నవంబర్ 06, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పత్తూరు క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృత్యువాత పడ్డారు. ఖాజీపేట సీఐ వంశీధర్ తెలిపిన వివరాల మేరకు గురువారం మధ్యాహ్న సమయాన కూనవారిపల్లి పంచాయితీ లోని సీతానగరం కి చెందిన కమలాపురం భీమరాజు స్ప్లెండర్ ప్లస్ బండిలో సొంత పని నిమిత్తం ఖాజీపేటకు వెళ్లి తిరిగి సీతానగరంకు వెళుతుండగా ఖాజీపేట బైపాస్ నందు పత్తూరు క్రాస్ వద్ద రాగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్ళిపోయింది. భీమరాజు తలకు రక్త గాయమై చనిపోయాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కలసపాడు, అక్టోబర్ 6 ప్రభాత వార్త:



మండలంలోని ఈక్రాపుతో సంబంధం లేకుండా నష్టపరిహారం రైతులు అందించాలని పంట నమోదు గడువును పొడిగించాలి సిపిఐ రైతు సంఘం కలసపాడు మండలంలోని ప్రతి రైతుకు పంట నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వంపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి గుడిమెట్ కుమార్ రాయప్ప మండిపడ్డారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపుమేరకు కలసపాడు మండలం చెన్నుపల్లి గ్రామంలో వారు పర్యటించారు. ప్రతి రైతు ఆదుకోవాలని బేస్తవారం మండల తహాసిల్దార్ కు వినతిపత్రం అందించారు. అంతేకాకుండా మహానంది పల్లి గ్రామంలో ఉల్లి పంట దదెబ్బతిన్న ఆ గ్రామాన్ని సందర్శించారు.

